క్లుప్తంగా

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

మహబూబాబాద్ రూరల్: ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమని ఉద్యాన శాఖ అధికారి విష్ణు అన్నారు. మండలంలోని కంబాలపల్లి గ్రామంలో గల పలువురు రైతులు సాగు చేసిన ఆయిల్ పాం తోటలను శుక్రవారం విష్ణు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ పంటలో డ్రిప్ ఇరిగేషన్ వాడకం సూచనలు చేశారు. ఆయిల్‌పాం సాగుతో వచ్చే దిగుబడి, లాభాలపై రైతులకు వివరించారు.

బోనాల సందడి



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో బోనాలతో మహిళలు శుక్రవారం మేళతాళాల నడుమ ఊరేగింపుగా వీరభద్రస్వామి ఆలయానికి వచ్చారు. భద్రకాళీ అమ్మవారి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

బెల్టుషాపులను రద్దు చేయాలి



నెల్లికుదురు: ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో బెల్ట్ షాపులను రద్దు చేసి మాట నిలబెట్టుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీశైలం, విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రత్తిరాం తండాలో శుక్రవారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు.

సమ్మె నోటీస్ అందజేత

మహబూబాబాద్: ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ ప్రసన్నరాణికి సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామస్వామి, శ్రీను, మహేష్, వెంగళరావు, నజీర్ పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలని వినతి


బయ్యారం: బయ్యారం సొసైటీలో చైర్మన్ మధుకర్‌రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా అవకతవకలకు పాల్పడ్డారని ఈ విషయంపై విచారణ నిర్వహించి చర్య తీసుకోవాలని శుక్రవారం సొసైటీ డైరెక్టర్లు కలెక్టర్, డీసీఓలకు ఫిర్యాదు చేశారు. సొసైటీలో సుమారు రూ.60లక్షల నిధులను అక్రమంగా సొంతానికి వాడుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంల వైస్ చైర్మన్ సత్యనారాయణ, డైరెక్టరు మల్లయ్య, శ్రీనివాస్, కేతమల్లు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కోట కనకయ్య, పీఈటీ ఎండి నసీరుద్దీన్ తెలిపారు. శుక్రవారం జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. తొర్రూరులో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి గత్క(సిక్కుల మార్షల్ ఆర్ట్స్) పోటీల్లో విద్యార్థులు జి.సాహితీ, కె.డేవిడ్ రాజ్‌లు కనబరిచినట్లు తెలిపారు. వీరు ఈనెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్‌లో జరగు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక



కేసముద్రం: నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా లింగాల నేతాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మడిపల్లి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా లింగాల రమేష్‌లను ఎన్నుకున్నారు.

పోక్సో కేసు నమోదు

నెల్లికుదురు: ఓ బాలికను వేధిస్తున్న కేసులో బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ శుక్రవారం తెలిపాడు. బాలికకు, బాలుడు మెసేజీలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక గత నెల 28న తన ఇంటివద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాలిక పరిస్థితి విషమంగా ఉంది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్ వివరించాడు.

అసౌకర్యాల నడుమ 'కస్తూర్బా'



పాఠశాల సమయంలో బకెట్స్‌తో నీళ్లు మోస్తున్న విద్యార్థినులు



వాటర్ ట్యాంక్ వద్ద నీటి నిల్వతో ఏర్పడిన పాకురు

చిన్నగూడూరు: పేద విద్యార్థులకు అన్నిసౌకర్యాలతో విద్యను అందించేందుకు మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల అసౌకర్యాల నడుమ కొనసాగుతుంది. డ్రెయినేజీ, నీళ్ల సమస్యతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా డ్రెయినేజీ దుర్వాసనతో మాస్కులు ధరించి క్లాస్‌లు వినాల్సిన పరిస్థితి ఏర్పడిందని విద్యార్థినులు తెలుపుతున్నారు. పర్యవేక్షించాల్సిన ఎస్‌ఓ లలిత అందుబాటులో లేక జిల్లా ఆఫీస్‌లకే పరిమితమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బయోలాజికల్ సైన్స్ బోధించడానికి సబ్జెక్ట్ టీచర్ లేక పీఈటీ టీచర్‌తోనే లాగిస్తున్నారని విద్యార్థినులు తెలుపుతున్నారు. నీళ్లు సరిగా రాక పాఠశాల సమయంలో క్లాస్‌లు వదిలేసి పంచాయతీ నల్లా వద్ద క్యూలైన్‌లో బక్కెట్స్‌తో మోయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. డ్రెయినేజీ సమస్యతో దుర్గంధంతోపాటు దోమల బెడద ఎక్కువై రాత్రి వేళల్లో దోమకాటుకు గురై అనారోగ్య బారిన పడాల్సిన పరిస్థితి ఏర్పడి విద్యార్థినులు తమ ఇళ్లకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని విద్యార్థినుల తల్లిదండ్రులు తెలుపుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పాఠశాలలో సరైన మౌలిక సదుపాయాలు కల్పించి , విద్యార్థినుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎస్‌ఓను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేదు.

గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు వీరే..

కురవి: ఉమ్మడి కురవి మండలంలోని అన్ని గ్రామలకు స్పెషల్ అధికారులను నియమించారు. అయ్యగారిపల్లి, కంచర్లగూడెం, కురవి, లింగ్యాతండా(కె)లకు తహసీల్దార్ సునీల్‌కుమార్, బీల్యానాయక్ తండా, సీరోలు, రేకులతండా(ఎస్)లకు తహసీల్దార్ నరేష్, మోద్గులగూడెం, తాళ్లసంకీస, ఉప్పరిగూడెంలకు ఎంపీడీఓ సరస్వతీ, జగ్యాతండా, జుజ్జూర్ తండా, మొగిలిచర్ల, నారాయణపురంలకు ఎంపీఓ రఘుపతిరెడ్డి, కొర్లకుంట తండాకు హెచ్‌ఎం బంగారి, చింతపల్లి, వస్రాం తండాలకు హెచ్‌ఎం శంకర్, కందికొండ, కొత్తూరు(సీ)లకు హెచ్‌ఎం ఇస్లావత్ లచ్చిరాంనాయక్, గుండ్రాతిమడుగు(విలేజి), పెద్దతండాలకు హెచ్‌ఎం జానయ్య, బలపాల, లింగ్యాతండా(బి)లకు హెచ్‌ఎం కె.నర్సింహారెడ్డి, గాజ తండా, నల్లెల్లకు హెచ్‌ఎం సత్యనారాయణచారి, తిర్మలాపురానికి హెచ్‌ఎం వాహిద్, కాకులబోడు తండా, నేరడలకు హెచ్‌ఎం బాలాజీ, తట్టుపల్లికి డిప్యూటీ ఈఈ ఇరిగేషన్ విజయబాబు, గోప తండా, రేకులతండా(కె), తులిస్యా తండాలకు ఏఈ నరేష్, బీబీనాయక్ తండా, సూదనపల్లి, తాట్య తండాలకు ఏఈ సుమన్, హరిదాసు తండా, పోలంపల్లి తండా, రాజోలు, స్టేషన్‌గుండ్రాతి మడుగులకు ఏఓ మంజుఖాన్, చంద్యాతండా, చీమ్లా తండా, ఎల్కచెట్టు తండాకు ఏఈ ప్రీతి, బంచరాయి తండా, కొత్తూరు(జీ), బంగారుగూడెంలకు ఏఈ శ్రీనివాస్, బూర్గుచెట్టు తండా, కాంపల్లి, సక్రాంనాయక్‌తండాలకు ఏఈ రాజమణిలను నియమించారు.

దంతాలపల్లి: మండలంలోని గ్రామాలకు ప్రత్యేక అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దంతాలపల్లి, బొడ్లాడకు తహసీల్దార్ శ్రీనువాస్‌రావు, గున్నెపల్లికి డీటీ శ్రీలత, పెద్దముప్పారానికి మండల నోడల్ అధికారి శ్రీదేవి, దాట్ల గ్రామానికి హెచ్‌ఎం కృష్ణయ్య, దొనకొండ, వేములపల్లి, రామానుజపురానికి ఎస్సారెస్పీ ఏఈ మౌనిక, అగపేట్, తూర్పుతండా, రామవరానికి వినయ్, ఎస్సారెస్పీ బీరిశెట్టిగూడెం, వాల్యాతండా మండల పశువైద్యాధికారి వినోద్, కుమ్మరికుంట్ల, నిదానపురం గ్రామాలకు ఎంపీడీఓ విజయలక్ష్మి, రేపోని, లక్ష్మీపురం గ్రామ పంచాయితీలకు ఎంపీఓ అప్సర్ పాషా ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు చేపట్టారు

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలో శుక్రవారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు.

మీ వెంటే ఉంటా: అధైర్య పడొద్దు



మాజీ సర్పంచ్‌లతో రెడ్యానాయక్

మరిపెడ: నేనుంతకాలం మీవెంటే ఉంటానని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. ఇటీవలే సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో మండలంలోని అన్నిగ్రామాల సర్పంచ్‌లకు మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో నవీన్ గెస్టహౌజ్‌లో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ జిల్లా ఎంపీగా కవిత పోటీలో ఉంటుందని, మనమందరం కలిసి ఆమెను గెలిపించుకోవలిసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్, ఎంపీపీ అరుణరాంబాబు, జెడ్పీటీసీ తేజావత్‌రవీందర్, మున్సిపల్ చైర్మన్ సింధూరరవికుమార్, నాయకులు రాముడుగు అచ్చుతరావు, మహేందర్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్/పెద్దవంగర: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షలు సంకా బద్రినారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని కంకరబోర్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు కళ్లెం వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శులు భూక్య రాంజీనాయక్, వై. ఉమాదేవి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, వెంకన్న, హెచ్‌ఎం కోట్యానాయక్ పెద్దవంగర సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి చెకుముకి సంబురాలు



మాట్లాడుతున్న అనిల్ గుప్తా

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని రవిచంద్ర కన్వెన్షన్‌లో నేడు నిర్వహించే జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ భువనగిరి అనిల్ గుప్తా అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఉదయం 9.30 గంటలకు వివిధ మండలాలలో జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులు ధ్రువీకరించిన లెటర్తోపాటు వారి గైడ్ టీచర్‌తో హాజరుకావాలని కోరారు. సమావేశంలో కోశాధికారి సాహితీ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపని మంగపతి రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రం రెడ్డి ఉమాదేవి, మండల అధ్యక్ష, కార్యదర్శులు బండి నరేందర్‌రెడ్డి, సునీత, సురేష్, చొప్పరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో శుభ్రతపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెద్దవంగర: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా నియమితులైన గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులతో సమావేశం చేపట్టారు. సర్పంచ్‌ల పదవికాలం ముగిసినందున గ్రామాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. అందుబాటులో ఉన్న నిధుల సద్వినియోగం చేసుకొని జీపీ సిబ్బందికి వేతనాలు చెల్లించేలా చొరవ చూపాలని చెప్పారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెత్తచెదారం లేకుండా మురుగు కాలువలను శుభ్రం చేసి గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, ఎంపీఓ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు ఆర్‌ఏఈ దయాకర్, యాకుబ్‌పాషా, స్వాతి, లక్ష్మి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవినీతి

నర్సింహులపేట: ఉపాధి హామీ పనులపై మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదికలో అవినీతి బయట పడింది. గత అక్టోబర్ 2021 నుంచి మార్చి 2023 వరకు పలు గ్రామాల్లో సుమారుగా రూ.7కోట్ల పనులకు తనిఖీ చేశారు. 13 గ్రామాల్లో రూ.2,18,087 పంచాయతీ సెక్రట్రీలు, టీఏలు, అపరేటర్లు, ఈసీ, ఏపీఓ, ఎఫ్‌ఏలు అవినీతికి పాల్పడినట్లు తెలియచేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ శాంతకుమారి, విజిలెన్స్ అధికారి యాకూబ్, అంబుడ్స్‌మెన్ అధామ్, ఎంపీడీఓలు భారతీ, సత్యనారాయణరెడ్డి, ఎంపీఓ సోమ్‌లాల్, ఏపీఓ భూపాల్‌రెడ్డి, ఎస్‌ఆర్‌పీ నర్సయ్య పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కోతుల మృతి

దంతాలపల్లి: మండలంలోని రేపోని గ్రామంలో విద్యుత్ షాక్‌తో నాలుగు కోతులు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం స్తంభానికి సపోర్ట్ కోసం వేసిన స్టే వైరు కొన్ని రోజుల క్రితం తెగిపోయింది. ఈక్రమంలో స్టే వైరుకు స్తంభానికి విద్యుత్ సరఫరా కాకుండా మధ్యలో ఉండే గైడ్ కూడా పోయింది. రైతులు అది గమనించి విద్యుత్ అధికారులకు తెలిపారు. విద్యుత్ అధికారులు అక్కడికి చేరుకొని స్టే వైరును స్తంభానికి చుట్టారు. వైరుకు అప్పుడప్పుడు విద్యుత్ సరఫరా అవుతుందని పలుమార్లు చెప్పిన స్టే వైరు సరిచేయకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. పొలంలోకి వచ్చిన కోతుల గుంపు అక్కడ రైతులను గమనించి పారిపోయే క్రమంలో నాలుగు కోతులు స్తంభానికి తగలడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో రైతులు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వలనే కోతులు చనిపోయాయని వాపోయారు.

పోరాటాలకు యువత సిద్ధం కావాలి

నెహ్రూసెంటర్: విద్యా, ఉపాధి, హక్కుల సాధన కోసం యువతరం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయసారథిరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఏఐవైఎఫ్ ముద్రించిన క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏళ్లుగా కోచింగ్ తీసుకుంటూ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలు చేసి నిరుద్యోగులను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, ప్రవీణ్, నాయకులు మహేందర్, నాగేంద్రబాబు, వెంకన్న, రమేష్, రవి, బిచ్చు, శేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు విద్యతోపాటు పలు క్రీడాల్లో రాణించాలని అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాస నాగమణి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం జిల్లాస్థాయి అథ్లెటిక్ బాల, బాలికలకు అండర్-8, అండర్-14 ఎంపికలు నిర్వహించారు. సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొనగా, 25మంది ఎంపికయ్యారు. ఈనెల 10న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు కృష్ణ, జ్యోతి, స్వప్న, సురేందర్, అశోక్, అసోసియేషన్ సభ్యులు వీరన్న, శోభన్‌బాబు, పార్వతి, రెడ్డి, రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర ఎనలేనిది



తొర్రూరు: సన్మానం అందుకున్న మాజీ సర్పంచులు

తొర్రూరు: గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర ఎనలేనిదని ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్‌అన్నారు. సర్పంచుల పదవీ కాలం ముగిసిన సందర్భంగా శుక్రవారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మాజీ సర్పంచ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సింగారపు కుమార్, తహసీల్దార్ వినోద్‌కుమార్, ఎంపీఓ గౌస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి, ఏఓ కుమార్‌యాదవ్, సర్పంచులు పాల్గొన్నారు.

గార్ల: మండలంలోని మర్రిగూడెం మాజీ సర్పంచ్ భూక్యా బుజ్జి రాములును మండల అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వాతిబిందు, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ రజిని పాల్గొన్నారు.

డోర్నకల్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పదవీకాలం ముగిసిన సర్పంచులతోపాటు పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. హటాన్యా తండాలో గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దేవిశంకర్‌నాయక్‌తోపాటు పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

చిన్నగూడూరు: చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి మాజీ సర్పంచ్ బీసు పూలమ్మ మల్లేశం సేవలు అభినందనీయమని ఎంపీటీసీ భర్తాపురం ఉదయమ్మ కొమిరెల్లి పేర్కొన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం ఐదేళ్ల పదవీకాలం ముగియడంతో శుక్రవారం జీపీ పాలకవర్గాన్ని సన్మానించారు.

ఆస్తులను సమకూర్చాం

డోర్నకల్: నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీకి ఆస్తులు సమకూర్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఫకీరాతండా మాజీ సర్పంచ్ గుగులోత్ సునీత తెలిపారు. శుక్రవారం శుక్రవారం ఏర్పాటు చేసిన పాలకవర్గ వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడారు.

సంక్షిప్త సమాచారం

సంఘం పేరు వాడితే చర్యలు

మహబూబాబాద్ అర్బన్: పీఆర్టీయూ సంఘం పేరును వాడుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర అర్థిక కార్యదర్శి పులి దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సంఘం పేరుతో కొందరు కార్యక్రమాలు, కమిటీలు అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. సంఘం పేరుతో ప్రచారం చేస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి రంజాన్ అలి, రాంజీ, కుమార్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

పెద్దవంగర: రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏల కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరుతూ మండల వీఆర్‌ఏలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహేందర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు సీరటి యాకయ్య, చెరకు వెంకటయ్య, యాకుబ్‌పాషా, వెంకటనారాయణ, అంజయ్య పాల్గొన్నారు.

ఎంపీ టికెట్‌కు దరఖాస్తు

గూడూరు: మండలంలోని రాములుతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నూనావత్ రాధ, మర్రిమిట్టకు చెందిన, సంగారరెడ్డిలో విద్యుత్ అధికారిగా పనిచేస్తున్న ఎట్టి వెంకన్న కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశిస్తూ శుక్రవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

పార్టీనుంచి సస్పెన్షన్

బయ్యారం: కాంగ్రెస్ పార్టీ నుంచి జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌నాయక్‌ను సస్పెన్షన్ చేస్తూ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు పార్టీ మండల అధ్యక్షులు కంబాల ముసలయ్య యాదవ్ శుక్రవారం తెలిపాడు. ప్రెస్‌మీట్‌లో పార్టీ నాయకుల పట్ల అనుచితంగా ప్రవర్తించటంతో సస్పెన్షన్ చేసినట్లు పేర్కొన్నాడు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

నెల్లికుదురు: విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ తరగతులను నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం స్వప్న అన్నారు. మండలంలోని మునిగలవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పర్సనాల్టి డెవలప్‌మెంటు, కమ్యూనికేషన్ స్కిల్స్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, మెంటల్ డెవలప్‌మెంట్, తల్లిదండ్రులు, గురువుల విలువలు వంటి విషయాలపై ట్రైనర్ సురేంద్ర, కాసిం, వరుణ్ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నార్మల్ డెలివరీలు

గార్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నార్మల్ డెలివరీలు ఎక్కువగా అయ్యేలా ప్రోత్సహిస్తామని గార్ల సీహెచ్‌సీ డాక్టర్ సతీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని వస్రాంతండాకు చెందిన ఐశ్వర్యకు స్థానిక సీహెచ్‌సీ ఆస్పత్రిలో నార్మల్ డెలివరీ చేయగా మగ బిడ్డకు జన్మనిచ్చింది. డెలివరీ అనంతరం ఐశ్వర్యకు డెలివరీ కిట్‌ను అందజేశారు. స్టాఫ్ నర్సులు స్వరూప, నాగమణి, శాంతాబాయి, ఆశవర్కర్ రుక్మిణి పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: జిల్లాలో అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షులు మట్టూరి నాగేశ్వర్‌రావు శుక్రవారం అన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త మృతి

గూడూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు జన్ను రాజు (28) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెల్సుకున్న సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్‌తో పాటు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, ఎంపీటీసీ కత్తి స్వామి, యాకూపాష, యాకాంబ్రంగౌడ్, బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సంతాపం తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

బయ్యారం: బయ్యారంలోని బాలుర ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం పాఠశాలలో సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం దేవేంద్రాచారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ పూల్‌చంద్‌తోపాటు గెజిటెడ్ హెడ్మాస్టర్లుగా బదిలీపై వెళ్లిన వేణుగోపాల్‌రెడ్డి, లింగరాజుతోపాటు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కేసముద్రం: ఖమ్మంలో ఈనెల 11, 12వ తేదీలలో నిర్వహించనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సీహెచ్.వెంకట్రాంనర్సయ్య, రాష్ట్ర కౌన్సిలర్ తండా సదానందం, హెచ్‌ఎం రాజు, నరసింహరాజు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

గూడూరు: మండలంలోని బ్రాహ్మణపల్లి సమీప పాకాలవాగు ఒడ్డున వెలసిన శ్రీమేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రదేశాన్ని శుక్రవారం తహసీల్దార్ అశోక్‌కుమర్ సందర్శించారు. ఈనెలలో జాతర జరగనున్న దృష్ట్యా శాశ్వత రహదారి ఏర్పాట్లు, తాగునీటి ఏర్పాట్లను పరిశీలించారు.

పుస్తక సమీక్ష పోటీల్లో ప్రతిభ

మరిపెడ: ఖమ్మంలో జరిగిన జాతీయస్థాయి పుస్తక సమీక్ష పోటీల్లో మరిపెడ మోడల్‌స్కూల్ విద్యార్థులు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ ఎలియేట్ ప్రేమ్ సాగర్ తెలిపాడు. జి.లక్ష్మి, స్వరూప ఎంపికయ్యారని తెలిపారు.

పంతులు తండాలో వరుస దొంగతనాలు

దంతాలపల్లి: మండలం బీరిశెట్టిగూడె గ్రామం పంతులు తండాలో పది రోజుల్లో వరుసగ మూడు దొంగతనాలు జరిగాయి. తాజాగా గురువారం రాత్రి తండాలో ధరావత్ మాజీ అనే వృద్ధ మహిళ ఇంట్లో ఒక గొర్రెపోతు, రెండు మేకలను దొంగిలించినట్లు గ్రామస్తులు తెలిపారు. వరుసదొంగతనాలతో తండావాసులు భయాందోళనకు గురి అవుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై రమేష్‌బాబు పోలీసులతో సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు చేశాడు.

మహిళల సంక్షేమానికి కృషి



పెద్దవంగర: మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని టీపీసీసీ మాజీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బొమ్మకల్లు గ్రామంలో హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి టారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా చీరల పంపిణీ చేశారు.

గుంటూరు మందులు విక్రయించొద్దు

బయ్యారం: పురుగుమందుల షాపుల్లో గుంటూరు నుంచి తెచ్చిన బయోమందులను విక్రయించొద్దని ఏఓ రాంజీ అన్నారు. మండలంలోని కొత్తపేటలోని ఎరువులు, పురుగుమందుల షాపులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. నకిలీమందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


ఆంగ్లభాషపై పట్టు సాధించాలి

డోర్నకల్: ప్రతీ విద్యార్థి ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని పెరుమాళ్ల సంకీస జెడ్పీహెచ్‌ఎస్ ఆంగ్ల ఉపాధ్యాయులు సుంకర శ్రీనివాస్ కోరారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన బెస్ట్ ఆఫ్ రీడింగ్ ఇంగ్లిష్ టెక్ట్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామ్మూర్తి, ఉపాధ్యాయులు వెంకట్రామయ్య, నాగమణి, శంకరయ్య, లక్ష్మీరాజేశ్వర్ పాల్గొన్నారు.


కల్యాణ మహోత్సవం

గార్ల: మండలంలోని పుల్లూరు గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం దేవాలయం ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు.

స్వయంపాలన దినోత్సవం



కేసముద్రం: పెనుగొండలో..



కురవి: గుండ్రాతిమడుగులో..

ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. - కేసముద్రం/కురవి

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

తొర్రూరు రూరల్: క్రీడలపై ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంపొందించుకోవాలని ఎస్సై జగదీష్ అన్నారు. మండలంలోని వెలికట్ట గ్రామంలో శుక్రవారం క్రికెట్ శిక్షణ కేంద్రాన్ని ఎస్సై ప్రారంభించారు. ఎస్సై మాట్లాడుతూ.. గ్రామీణ యువత ఆసక్తి ఉన్న క్రీడలో పాల్గొనాలని, నైపుణ్యాలు పెంపొందించుకుంటే జాతీయస్థాయి క్రీడాకారులుగా రాణిస్తారన్నారు. అంతర్జాతీయ ప్రాముఖ్యం కలిగిన క్రీడల్లో నైపుణ్యం సాధించేందుకు శిక్షణ కేంద్రాలు తోడ్పడుతాయన్నారు. కార్యక్రమంలో వెలికట్ట, భోజ్యా తండా సర్పంచులు పోసాని పుష్పలీల, మాలోతు కాలునాయక్, నిర్వాహకులు వడ్లకొండ శ్రీను, బందు ప్రభాకర్ పాల్గొన్నారు.

గంజాయి రవాణాదారుల అరెస్ట్

మహబూబాబాద్ రూరల్: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి కిలో ఆరు వందల ముప్పై గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని టౌన్ సీఐ బి.రమేష్ అన్నారు. ఈమేరకు గంజాయి రవాణాదారుల అరెస్ట్ వివరాలను ఆయన శుక్రవారం వెల్లడించారు. టౌన్ ఎస్సై పవన్ కుమార్, పీసీలు సుధీర్, సురేందర్, శ్రీకాంత్, రాజులతో కలిసి మహబూబాబాద్ పట్టణంలో తనిఖీ చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఆర్తీ గార్డెన్స్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వస్తుండగా అనుమానం వచ్చి వారిని ఆపి విచారించారన్నారు. వారి వద్ద గల ద్విచక్ర వాహనం డిక్కిలో ఓ పాకెట్ లభించగా దానిని పరిశీలించి చూడగా అందులో గంజాయి లభ్యమైందని తెలిపారు. దానిని స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులు మేక లోకేష్, ఇస్లావత్ సాయిగణేశ్‌లపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. సదరు యువకులు కొంత కాలంగా గంజాయి తాగేందుకు అలవాటు పడి, డబ్బులు సరిపోక గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగా గణేశ్‌తో కలిసి లోకేష్ చింతూరుకు వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి తీసుకువస్తున్నట్లు విచారణలో తెలిపారన్నారు. ఈ సమావేశంలో టౌన్ ఎస్సైలు రామారావు, పవన్ కుమార్, పీసీలు సుధీర్, సురేందర్, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.